విద్యాసంస్థలను పొగాకు రహిత ప్రాంతాలుగా ప్రకటించాలి
● వంద అడుగుల పరిధిలో అమ్మకాలు చేపట్టరాదు
● బస్సులపై పొగాకు ప్రకటనలు తొలగించాలి: ఏడీసీ
8



ట్రాఫిక్ సమస్యకు.. చెక్..!



● రూ.13 వేల కోట్లతో 16 ఎలివేటెడ్ కారిడార్లు ● డీపీఆర్ సిద్ధం
● 3 సంస్థలకు కాంట్రాక్టు ● బెంగళూరులో రద్దీ నివారణే లక్ష్యం

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం దినదినాభి వృద్ధి చెందుతుండడం, వలస వచ్చేవారి సంఖ్య అధికమవడం, ఉద్యోగ, వ్యాపారాల రీత్యా రోజూ 10 లక్షలమందికిపైగా రాకపోకలు సాగించడం వంటి చర్యలతో నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ నిత్యం రద్దీ కనిపిస్తోంది. ప్రతి చోటా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామనే మాటలు వినిపిస్తుంటాయి. వీటికి పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగానే మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా అడుగులు వేస్తోంది. నగర పరిధిలో 13వేల కోట్ల రూపాయలతో 16 ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది.

పెరుగుతున్న నగర విస్తీర్ణం

బెంగళూరు నగర పరిధి 741 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. సుమారు 12,878 కిలోమీటర్ల పొడవైన రోడ్ల మార్గం ఉంది. నగర జనాభా 1.40 కోట్లకుపైగా చేరింది. జనాభా పెరుగుతున్న కొద్దీ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఉండే రోడ్లు పెరుగుతున్న వాహనాలకు సమస్యగా మారింది. రోడ్లను వెడల్పు చేసేందుకు వీలుకావడం లేదు. మౌలిక సదుపాయాల కొరత ఉంది. ఓ నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ సమస్య ఉండే రెండోనగరంగా బెంగళూరుకు పేరుంది. నగరంలో 1.20 కోట్ల వాహనాలు ఉన్నాయి. చుట్టుపక్కల జిల్లాలు, రాష్ట్రాలనుంచి వచ్చే వాహనాల సంఖ్య లక్షల్లో ఉంటాయి. ఇలా గంటకు 10-12 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించేందుకు వీలవుతోంది. నగర ప్రజలు రోజూ ఎక్కువ సమయం రోడ్లపైనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్యతో నరకయాతన అనుభవిస్తున్నారు. వీటికి శాశ్వతమైన పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికొరకే ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాలని నిర్ణయించారు.

బెంగళూరు సమగ్ర సంచార నిర్వహణ పథకాన్ని రూ.13వేలకోట్లతో 16 ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని నిర్ణయించారు. ఢిల్లీకి చెందిన అల్టినోక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగా 16 ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన యాక్షన్‌ప్లాన్ ఇన్‌ఫ్రా సపోర్ట్ ఇంజనీరింగ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సిద్ధిశక్తి ప్రాజెక్ట్, నాగేశ్ కన్సల్టెంట్ అనే సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ మూడు సంస్థలు మూడు నెలల్లోగా డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నారు. తర్వాత టెండర్లు పిలిచే అవకాశం ఉంది. డీపీఆర్ కోసమే 24 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

కిలో మీటరుకు రూ.120 కోట్లు

నగర పరిధిలోని కనకపుర రోడ్డు కోననకుంటె క్రాస్ ద్వారా కనకపుర వైపు నుంచి బనశంకరికి ఫ్లై ఓవర్ లేదా అండర్‌పాస్, కనకపుర రోడ్డు రఘువనహళ్ళి అడయార్ ఆనందభవన్ వద్ద ఫ్లై ఓవర్, మారేనహళ్ళి మెయిన్‌రోడ్డు రాగిగుడ్డ 7వ జంక్షన్ నుంచి పైప్‌లైన్ రోడ్డు మార్గంగా కనకపుర రోడ్డు నుంచి నైస్‌రోడ్డుదాకా ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసేందుకు జనవరి 24న టెండర్లు ఆహ్వానించారు. టెండరులో సాంకేతికమైన బిడ్‌లకు 3 సంస్థలు అర్హత సాధించాయి. 12.20 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్, అండర్‌పాస్, ఫ్లై ఓవర్ నిర్మాణానికి కిలోమీటరుకు రూ.120కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు. దీనిద్వారా ఈ మార్గానికి 1,460 కోట్ల రూపాయలు ఖర్చు కానుందని భావిస్తున్నారు.

ఏ మార్గంలో ఎంతవరకు..?

యశ్వంతపుర మత్తికెరె క్రాస్ నుంచి ఐఐఎస్‌సీ, మేఖ్రి సర్కిల్, జయమహల్, సెయింట్‌జాన్స్ చర్చ్, హలసూరు చెరువు, పాతమద్రాస్ రోడ్డు, కేఆర్‌పురం వరకు 27 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.3,240 కోట్లు అంచనా వేశారు. మరో మార్గంలో కోననకుంటె క్రాస్ నుంచి బనశంకరికి 0.9 కిలోమీటర్లకు 108 కోట్లు, కనకపుర రోడ్డు అడయార్ ఆనంద్‌భవన్ వద్ద ఫ్లైఓవర్‌కు 0.98 కిలోమీటర్లకు రూ.96 కోట్లు, మారేనహళ్ళి మెయిన్‌రోడ్డు రాగిగుడ్డ 7వ జంక్షన్ నుంచి పైప్‌లైన్ రోడ్డు తలఘట్టపుర మీదుగా నైస్‌రోడ్డు దాకా 10.5 కిలోమీటర్లకు రూ.1260 కోట్లు, ఎంఐఐ జంక్షన్‌లో ఫ్లై ఓవర్‌కు రూ.60 కోట్లు, మడివాళ ట్రాఫిక్ స్టేషన్ అండర్‌పాస్ విస్తరణకు అరకిలోమీటరుకు రూ.60కోట్లు, హోసూరు రోడ్డు శూలె సర్కిల్ నుంచి వెల్లార్ జంక్షన్, ఆనెపాళ్య, ఆడుగూడి, ఫోరం జంక్షన్, సెయింట్‌జాన్స్ చర్చ్, మడివాళ, సిల్క్‌బోర్డ్ జంక్షన్ దాకా ఎలివేటెడ్ కారిడార్‌కు 7.4 కిలోమీటర్లకు 888 కోట్ల రూపాయలు, పాతమద్రాస్ రోడ్డులో స్వామి వివేకానంద మెట్రో స్టేషన్ నుంచి ఇందిరానగర్, దొమ్మలూరు, మడివాళ మార్గంలో సిల్క్‌బోర్డ్ జంక్షన్‌కు ఎలివేటెడ్ కారిడార్‌కు 10 కిలోమీటర్లకు రూ.1200 కోట్లు, నాగవార జంక్షన్ నుంచి రామకృష్ణ హెగ్డేనగర్, సంపిగెహళ్ళి, తిరుమేనహళ్ళి, బెళ్ళహళ్ళి, బాగలూరు జంక్షన్ దాకా 15 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.1800 కోట్లు, రింగ్ రోడ్డులో హెణ్ణూరు మెయిన్‌రోడ్డు జంక్షన్ నుంచి బాగలూరు జంక్షన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ 15 కిలోమీటర్లకు రూ.1800 కోట్లు, ట్యానరీ రోడ్డు నుంచి మాధవ మొదలియార్ రోడ్డు, నాగవార జంక్షన్ దాకా ఎలివేటెడ్ కారిడార్ 3.5 కిలోమీటర్లు రూ.660 కోట్లు, వెస్ట్ ఆఫ్ కార్డ్ రోడ్డు నుంచి నందిని లే అవుట్ పైప్‌లైన్ రోడ్డు ద్వారా రింగ్‌రోడ్డు దాకా ఎలివేటెడ్ కారిడార్‌కు 4.5 కిలోమీటర్లకు రూ.540 కోట్లు, యలహంక ఉపనగర నుంచి దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం దాకా 4 కిలోమీటర్లు రూ.480 కోట్లు, ఆనందరావ్ సర్కిల్ నుంచి నృపతుంగ రోడ్డుమీదుగా కేఆర్ మార్కెట్ సర్కిల్ దాకా 1.7 కిలోమీటర్లు రూ.204కోట్లు, హడ్సన్ సర్కిల్‌నుంచి మినర్వ సర్కిల్ వరకు ఇంటిగ్రేటెడ్ ఎలివేటెడ్‌కు 2.7 కిలోమీటర్లకు 324 కోట్లు, శిరసి సర్కిల్ నుంచి మైసూరురోడ్డు మీదుగా నాయండహళ్ళిదాకా ఎలివేటెడ్ కారిడార్ 3.5 కిలోమీటర్ల రూ.420 కోట్లు ఖర్చు చేయదలిచారు.

ఉత్తరం నుంచి దక్షిణం వైపు సొరంగ మార్గం

బెంగళూరు ఉత్తర హెబ్బాళ ఎస్టీమ్‌మాల్ జంక్షన్ నుంచి సిల్క్‌బోర్డు జంక్షన్ దాకా 16.745 కిలోమీటర్ల మేర సొరంగమార్గ నిర్మాణానికి రూ.17,780 కోట్లు అంచనా వేశారు. టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధం చేశారు. ఈ పనులన్నీ పూర్తయ్యేసరికి కనీసం నాలుగైదేళ్ల సమయం పట్టనుంది. అప్పటికీ బెంగళూరు నగరం మరింత రద్దీ అయ్యే అవకాశం ఉంది.


అందరికీ.. ఉపయోగం..!



యోగా చేస్తున్న శ్రీనివాసులు

● యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
● చిన్నా, పెద్ద, వృద్ధులు ఆచరించాలి
● గురువుల సూచన
● యోగా దినోత్సవానికి అంతా సిద్ధం

బళ్లారి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'యోగా' భారతదేశ సంస్కృతిలో ప్రాచీనమైనది. సంస్కృతంలో యుగ్ అనే పదాన్నే యోగాగా పిలవడం ఆనవాయితీ. పూర్వం భృగుమహర్షి యోగా, ధ్యానం అధికంగా ఆచరించేవారు. ప్రతి దినం యోగాభ్యాసం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ధృడత్వం లభిస్తుంది. ఆధునిక కాలంలో సంపూర్ణ మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని యోగా గురువులు ఆదవాని కమ్మ శ్రీనివాసులు, కోట ప్రాంత వాసి బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్ శ్రీనివాసులు తదితరులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో నిత్యం యోగా అభ్యసిస్తున్న గురువులు పలు ఆసక్తి, ఆరోగ్య కర అంశాలు వెల్లడించారు. చిన్న, పెద్ద, వృద్ధులు అందరూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సూచించారు. యోగా దినోత్సవానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లో యోగ దినోత్సవంలో పాల్గొననున్న నేపథ్యంలో కర్ణాటకలో యోగా దినోత్సవ సంబరాలకు క్రీడా మైదానాలు, పాఠశాలలు, విశాలమైన ప్రదేశాల్లో ఏర్పాట్లు ముమ్మరం చేశారు.




ఆసనం వేస్తున్న ఆదవాని కమ్మ శ్రీనివాసులు



56 మంది బదిలీ

● మంగళూరు కమిషనరేట్‌లో పోలీస్ సిబ్బందిపై వేటు..
● వరుస హత్యలపై సర్కార్ చర్యలు
● ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లకూ స్థాన చలనం

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా మంగళూరు నగర పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఏకంగా 56 మంది పోలీసు సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రధానంగా సీసీబీ, సెన్ పోలీసులతో పాటు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని బదిలీ చేశారు. ఇటీవల హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టిను హతమార్చిన వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు కలిగిన హెడ్ కానిస్టేబుల్ రశీద్‌శోపై బదిలీ వేటు వేశారు. అతడిని మంగళూరు మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. మంగళూరు పరిధిలో సుహాస్‌శెట్టితో పాటు ముస్లిం వర్గానికి చెందిన ఇద్దరు హతమైన విషయం తెలిసిందే. వరుస ప్రతీకార హత్యల నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి దక్షిణకన్నడ జిల్లా ఎస్పీతో పాటు నగర పోలీసు కమిషనర్‌లను బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఏకంగా ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి అధికారులందరినీ బదిలీ చేశారు.

లోకాయుక్తలో ఖాళీల భర్తీకి కేబినెట్ ఆమోదం

● జలచరాల సంరక్షణకు హొన్నావరలో వన్యజీవి ధామ ● క్యాష్‌లెస్ చికిత్సలకు ఓకే ● కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త సంస్థలో ఖాళీగా ఉన్న కీలకపోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. లోకాయుక్తలో పెండింగ్‌లో ఉన్న కేసులను దర్యాప్తు చేసేందుకు విచారణాధికారిగా రిటైర్డు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రమాకాంత్ చౌహాన్, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదాకు సంజయ్ బీ భట్‌ను నియమించదలిచారు. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న పలు నిర్ణయాలను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. వన్యజీవిధామ అరణ్య, జీవి పరిస్థితి మరియు పర్యావరణ శాఖ ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర సముద్రతీరం 6 కిలోమీటర్ల మేరకు ఉన్న ప్రాంతం, అటవీప్రదేశాన్ని మొత్తం 5,959.322 హెక్టార్లను అప్సరకొండ ముగలి కడల వన్యజీవిధామగా ప్రకటిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. సముద్రవన్యజీవిధామలో సంప్రదాయ మత్స్యకారులు దోణిల ప్రవేశానికి నిర్బంధం లేదన్నారు. అక్కడి ప్రజల అస్తిత్వానికి హక్కులకు ఎలాంటి నిర్బంధం ఉండదన్నారు. ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర 8.21 కిలోమీటర్ల సముద్రతీరంలో 6కిమీటర్ల మేర ప్రాంతం, 835 హెక్టార్ల అటవీ ప్రదేశం సహా అప్సరకొండ ముగలి కడల వన్యజీవిధామగా ప్రకటించినట్టు తెలిపారు. జలచరాల రక్షణే ప్రధాన ఉద్దేశ్యంగా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

క్యాష్‌లెస్ చికిత్సలకు ఓకే

ప్రభుత్వ ఉద్యోగులకు నగదురహిత ఆరోగ్య చికిత్సలు అందించేలా తీర్మానించామన్నారు. ప్రభుత్వశాఖలలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, గౌరవధనం ఆధారంగా పనిచేసేవారు సుమారు 3లక్షలమంది ఉన్నారని, సువర్ణ ఆరోగ్య సురక్షా ట్రస్టు ద్వారా ఏడాదికి రూ.5లక్షల వరకు క్యాష్‌లెస్ ఆరోగ్యసేవలు అందించనున్నట్టు తెలిపారు. ఇందుకుగాను సిబ్బందికి నెలకు 100 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందన్నారు.



అనుభవ మండప నిర్మాణానికి ఆమోదం

బీదర్ జిల్లా బసవకల్యాణలో నిర్మించనున్న అనుభవ మండపానికి రూ.742కోట్లు అంచనా వేశారని, ఇందుకు పాలనా ఆమోదం తెలిపారన్నారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయదలిచామన్నారు.

మామిడి రైతుల పరిహారానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా వ్యవసాయ శాఖ మంత్రికి సూచించినట్టు తెలిపారు. కోలారు, బెంగళూరు గ్రామీణ ప్రాంతాల వారు చర్చించారు. అవసరమైతే కేంద్రమంత్రిని భేటీ అయి మామిడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జూలై 17న నందికొండలపై కేబినెట్

జూన్ 19న నందికొండలపై కేబినెట్ భేటీ నిర్వహించాలని తొలుత నిర్ణయించి సన్నాహాలు చేపట్టాక ఒకరోజు ముందు వాయిదా వేశారు. దీంతో చిక్కబళ్ళాపుర జిల్లా వాసులనుంచి ఒత్తిడి రావడంతో జూలై 17న మంత్రివర్గ సమావేశం నిర్వహించేలా తీర్మానించారు. కాగా పలు బిల్లులపై చర్చలు జరిపినట్టు తెలిపారు.

11 రోజులపాటు మైసూరు దసరా వేడుకలు | తొక్కిసలాటపై సామాజిక కార్యకర్త ఫిర్యాదు | ఉత్సాహంగా అక్షరాభ్యాసం 7లో


30 వేల పుస్తకాలతో రూపొందించిన రాహుల్‌గాంధీ చిత్రం

పుస్తకాలతో పుట్టినరోజు శుభాకాంక్షలు

● బెంగళూరు సెంట్రల్ కాలేజీ ప్రాంగణంలో అరుదైన దృశ్యం
● 30 వేల బుక్కులతో రాహుల్ గాంధీ చిత్రపటం


బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్షనేత కాంగ్రెస్ పార్టీ కీలక నేత రాహుల్‌గాంధీకి అభిమానులు అరుదైన అద్భుతమనిపించేలా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీకు శుభాకాంక్షలు తెలిపారు. బెంగళూరు సెంట్రల్ కాలేజి ప్రాంగణంలో 200 మంది కార్యకర్తలు, విద్యార్థులు కలిసి రెండురోజుల పాటు 30వేల పుస్తకాలతో రాహుల్‌గాంధీ చిత్రాన్ని రూపొందించారు. ఇటీవల రాహుల్‌గాంధీ తరచూ చేతిలో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని కనిపించే రీతిలోనే సర్వాంగసుందరంగా తీర్చారు. గురువారం డీసీఎం డీకే శివకుమార్ ప్రత్యేక కళాఖండం రీతిలో తయారు చేసిన రాహుల్‌గాంధీ రూపాన్ని చూసి యూత్ కాంగ్రెస్ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సందర్భంగా 15 మంది దివ్యాంగులకు వీల్‌ఛైయిర్‌లను పంపిణీ చేశారు.

కేంద్రమంత్రి కుమారస్వామికి బిగ్ రిలీఫ్...!

● భూముల ఆక్రమణ కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై హైకోర్టు స్టే



బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు బిడది పరిధిలో కేంద్రమంత్రి కుమారస్వామి కేతగానహళ్ళి గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపణలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిట్ నుంచి హైకోర్టు ధర్మాసనం బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేయాలంటూ కేంద్రమంత్రి కుమారస్వామి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. గురువారం ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఇందిరేష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై స్టే విధించింది. కేతగానహళ్లి పరిధిలో ఉండే కేంద్రమంత్రి కుమారస్వామి ఫాం హౌస్‌కు అనుబంధంగా ఉండే ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారి ఆమ్లన్‌ఆదిత్య భిశ్వాస్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా ఆరుఎకరాల భూమి ఆక్రమణ జరిగిందని వదులుకోవాలని తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడాన్ని ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ ఏర్పాటు చట్ట వ్యతిరేకమని, సదరు దర్యాప్తు అధికారులు తీసుకున్న చర్యలను చెల్లుబాటు కావంటూ కుమారస్వామి తరుపున సీనియర్ న్యాయవాది ఉదయ్ హొళ్ళ, ఎవి నిశాంత్‌లు వాదనలు వినిపించారు. సమగ్ర విచారణల అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌కు స్టే విధించింది. దీంతో కేంద్రమంత్రి కుమారస్వామికు భారీ ఉపశమనం లభించినట్లు అయ్యింది.



బళ్లారి కలెక్టర్ ఎవరో..?

● ప్రతిష్టాత్మక జిల్లాకు ఐఏఎస్‌నే నిమించాలని ఎంపీ తుకారాం పట్టు..?
● హొస్పేట్ కలెక్టర్‌నే నియమించాలని మంత్రి జమీర్ ప్రయత్నం
7



బాధితులకు సేవ చేసే అవకాశం
భవిష్యత్తుకు భరోసా
కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉద్యోగాలు
నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
జూలై 6న పరీక్ష

నర్సింగ్‌తో విదేశాల్లోనూ అవకాశాలు

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఎన్‌సెట్-2025) నిర్వహించనున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కింద నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు శుక్రవారం వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాలుగు సంవత్సరాల బీఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాలు పొందాలంటే ఇంటర్మీడియట్‌గానీ, తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. http-s://drntr. uhsap.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 6న పరీక్షలు నిర్వహించనున్నారు. ఏపీఎన్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని ఒక ప్రభు త్వ, తొమ్మిది ప్రైవే టు నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు.



5 సబ్జెక్టులు, 100 మార్కులు...

ఆన్‌లైన్ విధానంలో ఏపీఎన్‌సెట్ నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో చదివిన పాఠాలనే ప్రశ్నపత్రంగా రూపొందిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్, నర్సింగ్ ఆప్టిట్యూడ్ ఈ ఐదు సబ్జెక్టుల్లో 20 ప్రశ్నల చొప్పున మొత్తం 100 మార్కులుంటాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎంతోమంది విదేశాల్లో ఉద్యోగం సాధించాలని కలలు కంటుంటారు. వాటిని నిజం చేసుకోవాలంటే ఇంజనీరింగ్, కంప్యూటర్, మెడిసిన్ కోర్సులు చేసేవారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులకు విదేశీ కలలు కల్లలుగానే మిగిలిపోయేవి. అలాంటి వారు బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే విదేశాల్లో ఉద్యోగ కలను నెరవేర్చుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందవచ్చు. కార్పొరేట్ వైద్య సంస్థల్లో సైతం భారీ



ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. వైద్య రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్‌కు అవకాశాలు కొదవేలేవని నిపుణులు పేర్కొంటున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అందిస్తున్న నాలుగేళ్ల నర్సింగ్ బీఎస్సీ కోర్సును పూర్తి చేస్తే ఉద్యోగాలు వెతుక్కోవాల్సిన అవసరం లేదని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి.



అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

పీహెచ్‌డీతో రీసెర్చ్...

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు పీజీ చేసి, పీహెచ్‌డీలో రీసెర్చ్ చేయవచ్చు. తద్వారా నర్సింగ్ కళాశాలల్లో ట్యూటర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా బోధనావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. కళాశాలల్లోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్ అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వమే స్టైఫండ్ చెల్లిస్తుంది. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచితంగా ఆ దేశ భాష నేర్పిస్తున్నారు.

కనీస మార్కులు...

నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించాలంటే ఇంటర్మీడియట్‌లో సైన్స్ సబ్జెక్టుల్లో కనీస మార్కులు సాధించి ఉండాలి. ఐసీఎస్ఈ, ఎస్ఎస్‌సీఈ, హెచ్ఎస్‌సీఈ, ఎన్ఐఎఎస్, ఏపీఓఎస్ఎస్ తదితర బోర్డుల నుంచి ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులున్నా అర్హులే.

విదేశాల్లోనూ అవకాశాలు



నర్సింగ్ చేసిన విద్యార్థులకు విదేశాల్లోనూ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్‌తో పాటే జర్మన్ భాషను రాష్ట్ర ప్రభుత్వం.. విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తుంది. తద్వారా జర్మనీలో ఉద్యోగాలు పొందుతున్నారు. కళాశాల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయవచ్చు. కళాశాలలోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

-ప్రొఫెసర్ అనంతమ్మ,
ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

వైద్యసేవల్లో కీలక పాత్ర



వైద్యసేవల్లో నర్సింగ్ విభాగం కీలక పాత్రపోషిస్తుంది. బాధితులు ఆస్పత్రిలో చేరినప్పట్నుంచి డిశ్చార్జి అయ్యేవరకు అన్ని సేవలను నర్సులు అందిస్తారు. వైద్యరంగం విస్తరణలో భాగంగా ఆస్పత్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నర్సింగ్‌ను ఎంచుకున్న విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వైద్యకేంద్రాలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తోంది.

- మంగమ్మ, హెడ్‌నర్స్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

జీవితానికి భరోసా..



మా అమ్మానాన్న రైతు కూలి పనులు చేసి బీఎస్సీ నర్సింగ్ చదివించారు. స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం లభించింది. బాధితులకు వైద్యసేవలందించడంతోపాటు వ్యక్తిగతంగా నర్సింగ్ విద్య జీవితానికి భరోసా కల్పిస్తుంది. పేద, మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ సమానమైన బీఎస్సీ నర్సింగ్‌తో ఉద్యోగ కలను సాకారం చేసుకోవచ్చు.

-అనురాధ, స్టాఫ్‌నర్స్,
ప్రభుత్వ సర్వజనాస్పత్రి


వరండాలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

వరండాలో పాఠాలు

- వైటీ చెరువు జడ్పీ హైస్కూల్‌కు గదుల కొరత
- వరండాలోనే విద్యా బోధన.. విద్యార్థుల అవస్థ
- కొత్త భవనం పూర్తి చేయాలని తల్లిదండ్రుల విన్నపం

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతో ప్రగతి సాధించామని చెబుతున్నా కొన్ని చోట్ల విద్యార్థులకు నేలబారు చదువులు తప్పడం లేదు. తరగతి గదులు లేక వరండాల్లోనే చదువుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలం లోని వైటీచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 222మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. పాఠశాలలో 5 గదులు మాత్రమే ఉన్నాయి. అందులో మూడు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక గదిని స్టోర్‌రూంగా వినియోగించుకుంటున్నారు. మరో గదిలో ప్రధానోపాధ్యాయుడు గది, రికార్డు గది, ఇతర సామగ్రిని ఉంచడం కోసం వాడుకుంటున్నారు. ఉపాధ్యాయులకు కూర్చునేందుకు గది లేకపోవడంతో పాఠశాల తరగతి గదిలోనే ఉంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. నెలకొంది. మహిళా టీచర్లు, విద్యార్థినులకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. 6,7,8 తరగతులను పాఠశాల వరండాలో నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి మైదానం లేదు. వంట గది లేకపోవడంతో ఆరు బయటే వంట చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆరుబయట వంట చేస్తున్న మహిళలు

నిలిచిపోయిన పనులు

నాడు-నేడు ఫేస్-2 కింద మంజూరైన పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు నిధులు లేక నిలిచిపోయాయి. మూడేళ్ల కిందట ప్రారంభమైన భవన నిర్మాణ పనులు 80శాతం పూర్తయ్యాయి. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన పనులు అలాగే నిలిచిపోయాయి. దీంతో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


నిధులు లేక నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

మెరిసేదంతా బంగారమే!

- బంగారానికి ప్రత్యామ్నాయంగా రోల్డుగోల్డు
- అందుబాటులో రకరకాల డిజైన్లు
- తక్కువ ధరలో అందమైన ఆభరణాలు
- ఆసక్తి చూపుతున్న మహిళలు

కదిరి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు బంగారం ధర సామాన్యులకు అందకుండా రేసుగుర్రంలా పరిగెడుతోంది. మరోవైపు బంగారం నగలు ఇంటిలో పెట్టుకున్నా, ధరించి బయట తిరిగినా దొంగ ల భయం. ఈ నేపథ్యంలో మహిళలు ఇటీవల కాలంలో బంగారం నగలకు ప్రత్యామ్నాంగా రోల్డుగోల్డు ఆభరణాలపై ఆసక్తి చూపుతున్నా రు. తక్కువ ఖర్చుతో కోరుకున్న డిజైన్లలో నగలు లభిస్తుండటంతో మహిళలు వీటి పట్ల మొగ్గు చూపుతున్నారు. సంపన్న వర్గాలకు చెందిన మహిళలు సైతం శుభకార్యాల్లో రోల్డుగోల్డు వస్తువులు ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అభిరుచికి తగ్గట్టుగా వందలాది డిజైన్లల్లో అందుబాటులోకి వచ్చాయి. రోల్డుగోల్డు ఆభరణాలు ధరించడం ఫ్యాషన్‌గా మారడంతో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మ్యాచింగ్ కోసం

ఇటీవల మహిళలు, యువతుల్లో ఫ్యాషన్ పట్ల ఆసక్తి పెరిగింది. డ్రస్సుకు మ్యాచ్ అయ్యే ఆభరణాలు ధరించేవారి సంఖ్య పెరుగుతోంది. ధరించిన డ్రస్సుకు సరిపోయేలా రోల్డుగోల్డులో వివిధ రకాలు నగలు లభిస్తున్నాయి. ఈక్రమంలో వివిధరకాల రాళ్లతో(స్టోన్స్‌తో) తయారు చేసిన ఆభరణాలను చాలామంది యువతులు ఇష్టపడుతున్నారు. ఇంక ఆఫీసులకు వెళ్లేవారైతే సన్నని గొలుసుతోపాటు, బ్రాస్‌లెట్ లాంటివి ధరిస్తున్నారు. నల్లపూసల దండలు కూడా రోల్డుగోల్డులో లభిస్తుండటం తో ఎక్కువ మంది మహిళలు వాటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

విభిన్న మోడల్స్‌లో...

రోల్డుగోల్డులో పాపిడిబిళ్లలు, గాజులు, హారాలు, లాగ్స్ సెట్స్, చెవి దుద్దులు, వడ్డాణాలు వంటి ఆభరణాలు రకరకాల మోడల్స్‌లో లభిస్తున్నాయి. డిజైన్ బట్టి రూ.ఐదు వందల నుంచి రూ. ఆరు వేల వరకు ధరలు ఉన్నాయి.

పెళ్లిళ్లకు మరింత ప్రత్యేకంగా..

వివాహాల సమయంలో వధువు మరింత అందంగా కనిపించాలంటే ఆభరణలు ఉండాల్సిందే. తక్కువ ఖర్చుతో రోల్డుగోల్డు ఆభరణాలు కొనుగోలు చేసి, వాటిని అలంకరిస్తుంటారు. వివాహాల సమయంలో విక్రయాలు మరింత ఎక్కువగా ఉండటంతో, నిర్వాహకులు వెడ్డింగ్ కలెక్షన్ పేరుతో ప్రత్యేకంగా జ్యూవెలరీ తెప్పిస్తున్నారు. పెళ్లిళ్ల సమయంలో పెద్దహారం, చిన్నహారం, నక్లెస్‌లు, జుంకాలు కలిసి సెట్‌గా విక్రయిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనూ రకరకాల మోడల్స్

రోల్డుగోల్డు ఆభరణాల విక్రయాలు ఆన్‌లైన్‌లో జోరుగా సాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో అత్యధికంగా గోల్డు ప్లేటెడ్ బ్రాస్‌లెట్, భరత నాట్యం కెంపులు, కెంపుల్ స్టోన్ నక్లెస్, నవరత్న చైన్‌లాకెట్, గోల్డు ఫార్మింగ్ తదితర రకాలు కొనుగోలు చేస్తున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో డిస్కౌంట్లు ప్రకటిస్తుండటంతో వ్యాపారాలు జోరందుకున్నాయి.


రోల్డుగోల్డు ఆభరణాలు

జాగ్రత్తలు తప్పనిసరి

ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్న రోల్డుగోల్డు ఆభరణాల విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే పెట్టిన సొమ్ము వృథా అవుతుందని పలువురు చెబుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పదేళ్ల గడిచినా పాడవకుండా ఉంటాయని వ్యాపారులంటున్నారు. వీటిని పాలిథిన్ కవర్, లేదా ప్లాస్టిక్ బాక్స్‌లో భద్రపరచాలని చెబు తున్నారు. ఆభరణాలు ధరించిన తరువాత సువాసన ద్రవ్యాలు(పర్‌ఫ్యూమ్స్) వాడకూడదని, స్నానం చేసే సమయంలో తీసి పక్కన పెట్టడం, వేడి నీటికి ఆభరణాలను దూరంగా ఉంచడం మంచిదంటున్నారు. ఉపయోగించిన తరువాత వాటిని శుభ్రం చేస్తే చాల కాలం మన్నికగా ఉంటాయని చెబుతున్నారు.

ధైర్యంగా తిరగవచ్చు: సునీత, గృహిణి, కదిరి



రోల్డుగోల్డు ఆభరణాలు ధరించి ఎక్కడైనా ధైర్యంగా తిరగవచ్చు. దొంగల బెడద ఉండదు. మహిళలకు అందాన్ని ఇవ్వడమేకాకుండా తెలికగా ఉంటాయి. ఈఆభరణాల వల్ల మహిళలు ఇబ్బందులు పడరు. బంగారు ఆభరణాలు అయితే ప్రతి క్షణం వాటిగురించే ఆలోచిస్తూ ఉండాలి.

అందంగా కనిపిస్తాం: హరిత, ఉపాధ్యాయురాలు, కదిరి



బంగారు ఆభరణాలకు తీసిపోని రీతిలో రోల్డుగోల్డు ఆభరణాలు ఉంటున్నాయి. వీటిని ధరించడం వల్ల చాలా అందంగా కూడా కనిపిస్తాము. పైగా బంగారం ధరలు ఎక్కువగా ఉండటం, రోల్డుగోల్డు వస్తువులు తక్కువకు దొరుకుతుండటంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. రకరకాల డిజైన్లలో ఆభరణాలు లభిస్తుండటంతో ప్రాధాన్యం ఇస్తున్నాం.

మహిళల ఆసక్తి పెరిగింది: రవీంద్రారెడ్డి, వ్యాపారి, కదిరి



ఇటీవల రోల్డుగోల్డు ఆభరణాలపై మహిళలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ మహిళ నుంచి సంపన్న వర్గాలు, ఉద్యోగుల వరకు ఈఆభరణాలను ఎంచుకుంటున్నారు. మహిళల అభిరుచుల మేరకు అన్నిరకాల డిజైన్లు అందుబాటులో ఉంచుతున్నాం.

కరెన్సీ సారు..!

- రూ.7.50 కోట్ల మేర అక్రమాల ఆరోపణలు
- డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి వసూలు
- ట్రాన్స్‌ఫార్మర్‌కు సైతం అదనంగా ఇచ్చుకోవాల్సిందే..
- బాధితుల ఫిర్యాదులు
- కొనసాగుతున్న విచారణ

పుట్లూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఓ ఏఈ అవినీతి కోట్లు దాటింది. కరెంటు శాఖలో ఆయన కరెన్సీ సారుగా మారిపోయాడు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేసినట్లు బాధితులు మండిపడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, వైరు కోసం డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి డబ్బు గుంజాడంట. ట్రాన్స్‌ఫార్మర్, వైరు కావాలంటే అదనంగా ఇవ్వాలంటూ పెద్ద మొత్తంలో వసూలు చేశాడట. ఇటీవలి వరకు ఆ ఏఈ పనిచేసిన తాడిపత్రి నియోజకవర్గంలోని ఓ మండలంలో రూ.7.5 కోట్ల మేర అక్రమంగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకుని కూడా డీడీలు కట్టకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్, వైరు ఇవ్వకపోవడంతో పలువురు రైతులు.. ఆ ఏఈపై ఫిర్యాదు చేశారు. విషయం తన దృష్టికి రావడంతో ప్రజాప్రతినిధి తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలుస్తోంది. ఏఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కోరినట్లు సమాచారం. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ ఏఈ ఇటీవల శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. అయినా.. ఆయన తీరు ఏమాత్రం మారలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకొని నకిలీ బిల్లులు సృష్టించి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు సైతం ఆ అధికారిపై వినిపిస్తున్నాయి.

లక్షలు ముట్టజెప్పాల్సిందే..

రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ ఏఈ నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. రైతులు కట్టే డీడీల కన్నా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. రైతులతో నేరుగా డీడీలు కట్టించుకోకుండా తనకే నగదు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని తెలుస్తోంది. ఇలా ఏళ్ల తరబడి అక్కడే ఉండి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 458 మంది రైతుల నుంచి వసూలు చేశాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారం చేపట్టాక ఆ అధికారి ఆటలు సాగలేదు. సాధారణ బదిలీల్లో భాగంగా శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ మండలంలో కూడా ఆయన తీరులో మార్పు లేదని తెలుస్తోంది.

డీడీలు తానే తీస్తానంటూ..

సాధారణంగా రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అందుకయ్యే ఖర్చును విద్యుత్ అధికారులు అంచనా వేసి, చెబుతారు. అంత మొత్తానికి బ్యాంకులో డీడీ తీసి, ఏఈకి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ అధికారి మాత్రం నగదు తనకే ఇవ్వాలనీ, తానే డీడీ తీస్తానంటూ రైతులను డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రైతులే నేరుగా డీడీలు చెల్లిస్తే ఎంత హార్స్‌పవర్‌కు ఎంత అమౌంట్ చెల్లించామనేది తెలుస్తుంది. రైతుల నుంచి అధికంగా వసూలు చేసి, ఆయన డీడీలు తీసేవాడట. ఇలా రైతుల నుంచి అంచనాల కంటే అధికంగా డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విస్తుపోయిన ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి అడ్డగోలుగా వసూలుచేసిన ఆ అధికారి గురించి తెలుసుకున్న ప్రజాప్రతినిధి విస్తుపోయారని తెలుస్తోంది. రూ.7.50 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్లు ప్రజాప్రతినిధి దృష్టికి రావడంతో తక్షణమే ఆ అధికారిపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను కోరినట్లు సమాచారం. ఇలాంటి అధికారి తమకు వద్దంటూ బదిలీ చేయించినట్లు తెలుస్తోంది.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో

జీఎం తనిఖీలు

గుంతకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్ కుమార్ జైన్ గురువారం సాయత్రం స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఉదయం రైల్వే డివిజన్‌లోని తిరుపతి, రేణిగుంట స్టేషన్లను, అభివృద్ధి పనులను పరిశీలించిన జీఎం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా రేణిగుంట-గుంతకల్లు మధ్యన ఉన్న రైల్ ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. సాయంత్రం నాలుగున్నరకు గుంతకల్లుకు చేరిన జీఎం స్థానిక డీజిల్ షెడ్‌ను సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మించిన సోలార్ పవర్ వ్యవస్థను ప్రారంభించారు. యాగ్జిలరీ సర్వీస్ భవనాన్ని లాంచనంగా ఆవిష్కరించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లగా.. నెలాఖరున జీఎం ఉద్యోగ విరమణ ఉండటంతో ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయనను సన్మానించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులతో జీఎం సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

రెచ్చగొట్టేలా జగన్ మాటలు

తల్లి, చెల్లిని గెంటేసి, ఇప్పుడు మహిళలపై సానుభూతి

70 శాతం రెడ్లకు పదవులిచ్చి, కమ్మవాళ్లపై ఇప్పుడా ప్రేమ?

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో రెట్టింపు సంక్షేమం అమలవుతూ ఉంటే తట్టుకోలేని జగన్ తన సైకో బ్యాచ్‌తో రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. అనంతపురం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించేలా జగన్ వ్యవహరిస్తున్నాడన్నారు. 80 కిలోమీటర్లు ర్యాలీగా వెళ్లవద్దంటూ పోలీసులు చెప్పినా ఆయన పట్టించుకోలేదన్నారు. సభ నిర్వహించరాదన్నా ముందుకెళ్లి ఇద్దరి చావుకు కారణమయ్యాడంటూ విమర్శించారు. బెట్టింగ్‌లు ఆడి నాగమల్లేశ్వర్‌రావు ఏడాది కిందట మరణిస్తే.. ఇప్పుడు గుర్తుకు రావడం రాజకీయ డ్రామా అన్నారు. జగన్ కోసం వచ్చిన ఇద్దరు చనిపోతే...ఒక్క నిమిషం వాళ్ల కుటుంబీకులకు మాట్లాడించలేదన్నారు. జగన్ ఏపీలో కమల్‌హాసన్ లాగా బాగా నటిస్తున్నాడని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు, దళితులపై దాడులు, మహిళల హత్యల్లో అప్పటి జగన్ ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదన్నారు. కానీ అవన్నీ మరిచి నేడు మాట్లాడుతున్నారన్నారు. తల్లి విజయమ్మను పార్టీ నుంచి, షర్మిలను ఇంటి నుంచి గెంటేసిన ఆయన, అమరావతి మహిళలపై తన మీడియాలో వేశ్యలుగా మాట్లాడించిన జగన్ ఇప్పుడు మహిళల గౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గంజాయి తాగేటోళ్లు, రేపిస్టులు, భూకబ్జా కేసుల్లో ఉన్న వాళ్లను జగన్ పరామర్శించడానికి వెళ్లడాన్ని బట్టే జగన్ మనస్తత్వం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. మీరు నరికితే నరికించుకుంటారా..? అవతలి వాళ్లకు చేతులు ఉండవా... వేట కొటవళ్లు ఉండవా అని ప్రశ్నించారు. 2029లో అధికారంలోకి వస్తే అంటూ రెచ్చగొడితే ప్రజలు అధికారం కట్టబెట్టరని, మీ మాటలకు ప్రజల దగ్గర సమాధానం ఉందంటూ సూచించారు. ఇద్దరు పిల్లలుంటే అమ్మఒడి రూ. 30 వేలు ఇస్తామని చెప్పి, అర్ధ ఒడిగా చేశారన్నారు. తన ప్రభుత్వంలో 70 శాతం పదవులు తన సామాజికవర్గం వాళ్లకు ఇచ్చి, ఇప్పుడు కమ్మ వాళ్లపై ప్రేమ చూపడం హాస్యాస్పదమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో వందకు వంద శాతం రెట్టింపు సంక్షేమం అమలవుతోందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చందాల కేశవదాసు (జయంతి)




చందాల కేశవదాసు 1876 జూన్ 20న ఖమ్మం జిల్లా జక్కేపల్లిలో జన్మించారు. తొలి తెలుగు నాటకకర్త, తొలి సినీ గేయ రచయిత, కవి, నటుడు, గాయకుడు, హరికథా కళాకారుడు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో పాడే'పరబ్రహ్మ పరమేశ్వర' అనే గొప్ప కీర్తనను, ఆంధ్రదేశమంతటా ఉర్రూతలూగించిన ఎభలే మంచి చౌకబేరము పోయినన్ దొరకదు.. అనే పాటను రాసింది ఆయనే. తెలుగులో మొదటి శబ్ధచిత్రం 'భక్తప్రహ్లాద'కు పాటలు రాసి తొలి తెలుగు సినిమా పాటల రచయితగాను, తెలంగాణ హరికథా పితామహుడిగాను గుర్తింపు పొందారు. 1956 మే 14న కన్నుమూశారు.

గోర్డోన్ విలియమ్స్ (జయంతి)



బుకర్ ప్రైజ్ గ్రహీత గోర్డోన్ మాక్‌లీన్ విలియమ్స్ 1934 జూన్ 20న స్కాట్‌ల్యాండ్ దేశం పైస్లీ పట్టణంలో జన్మించారు. బుల్లితెరకు పలు రచనలు అందించడంతోపాటు 20కుపైగా నవలలు రచించారు. 'ఫ్రం సీన్స్ లైక్ దిస్' నవల ఎంతో పేరొందింది. అంతేకాక ఫుట్‌బాల్ క్రీడాకారుల అసోసియేషన్‌కు చెందిన బాబీ మూర్, టెర్రీ వెనబల్స్ జీవిత చరిత్రలు రాసి ఘోస్ట్‌రైటర్‌గా పేరొందారు. 2017 ఆగస్టు 20న కన్నుమూశారు.

విక్రమ్ సేథ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విక్రమ్ సేథ్ 1952 జూన్ 20న కోల్కత్తాలో జన్మించారు. లెక్కకు మిక్కిలి నవలలు రాశారు. కవిగా రాణించారు. ఎ సూటబుల్ బాయ్, ది గోల్డెన్ గేట్, ఆన్ ఈక్వల్ మ్యూజిక్ తదితర రచనలు పేరొందాయి. సాహిత్య అకాడమీ అవార్డు, ప్రవాసి భారతీయ సమ్మాన్, డబ్ల్యుహెచ్ స్మిత్ లిటరరీ అవార్డు, క్రాస్‌వర్డ్ బుక్ అవార్డు, కామన్‌వెల్త్ రైటర్స్ ప్రైజ్ తదితర అవార్డులు అందుకున్నారు. 'ది రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్' లోనూ గుర్తింపు పొందారు. 2001లో కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గుర్తింపు సాధించారు.

బళ్లారి కలెక్టర్ ఎవరో..?

బళ్లారి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలం నుంచి బళ్లారి జిల్లాగా గుర్తింపు పొందింది. బళ్లారి జిల్లాకు తొలి కలెక్టర్‌గా(డీ.సీ)గా సర్ థామస్ మన్రో లాంటి మేధావులు కలెక్టర్‌గా పనిచేశారు. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రత్యేకతలు ఈ జిల్లాకు ఉన్నాయి. ఇలాంటి జిల్లాకు ఇప్పటి వరకూ జిల్లా కలెక్టర్లుగా ఐఏఎస్ క్యాడర్ అధికారులనే ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. ఒకేఒక్క సారి మాత్రం కేఏఎస్ అధికారిని నియమించినా ఎక్కువ రోజులు పనిచేయలేదు. కానీ ఇప్పుడు ఈ జిల్లాకు కలెక్టర్ (డీ.సీ)నియామకం ప్రభుత్వానికి సంక్లిష్టంగా మారిందని తెలుస్తోంది.

● ప్రస్తుతం బళ్లారి జిల్లా కలెక్టర్‌గా ప్రశాంత్ కుమార్ మిశ్రా ఉన్నారు. ఆయన ఐఏఎస్ క్యాడర్ అధికారి, అయన బదిలీ అయితే.. ఇక్కడికి ఎవరిని నియమించాలని ప్రభుత్వం అలోచన లో పడింది. రాష్ట్ర మంత్రి, విజయనగర, బళ్లారి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న జమీర్ అమ్మద్ ప్రస్తుతం విజయనగర కలెక్టర్‌గా పనిచేస్తున్న దివాకర్‌ను బళ్లారి కలెక్టర్‌గా నియమించాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

దివాకర్ కేఏఎస్ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ నుంచి ఎన్నికైన అధికారిని బళ్లారి జిల్లా కలెక్టర్‌గా నియమించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నాలుగుసార్లు సండూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రస్తుత ఎంపీ ఈ. తుకారాం తన అభిప్రాయం ప్రభుత్వం వద్ద వ్యక్తం చేశారని తెలిసింది.ప్రస్తుతం విజయనగర జిల్లా(హొస్పేట్) జిల్లాలో పనిచేస్తున్న కేఏఎస్ అధికారి దివాకర్‌ను నియమించాలని మంత్రి ప్రభుత్వంతో పట్టుపట్టుకుని కూర్చున్నారని తెలిసింది. ఇక జిల్లా ఎమ్మెల్యేలు కొందరు దివాకర్‌కు, సరే అంటుంటే.. మరి కొందరు మాత్రం వద్దు ఉంటే ఉండే అధికారే ఉన్నిలేదంటే ఐఏఎస్ క్యాడర్ అధికారిని నియమించండి అని ప్రభుత్వంతో అన్నట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేలు, అయితే ఎవరైతే ఏమి జిల్లాలో పని చేసే అధికారి ని నియమించండి అని చెప్పినట్లు తెలిసింది. మొత్తం మీద బళ్లారి జిల్లా కలెక్టర్ ఎవరనే దానిపై జోరుగా చర్చలు మొదలయ్యాయి. సరే ఉంటే ఉండే కలెక్టరే మరో ఏడాది ఏన్నిలే ముందు చూస్తాం అని కూడా ప్రభుత్వం ఆలోచించినట్లు సమాచారం. బళ్లారి జిల్లా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మక, అత్యంత సెన్సిటీ జిల్లా, పైగా ఇది గడినాడు ప్రాంతంలో ఉండేది. ఇక్కడ అత్యంత సున్నిత అంశాలు, చాలెంజింగ్ సమస్యలు పరిష్కరించేందుకు అలాగే జిల్లా అభివృద్ధి కోణంలో చూసేందుకు ఐఏఎస్ అధికారినే నియమించాలని ప్రజలు కూడా కోరుతున్నారు. ఇక ప్రభుత్వం ఏలా నిర్ణయం తీసుకుంటుండో.. వేచి చూడాల్సిందే.

11 రోజులపాటు మైసూరు దసరా వేడుకలు

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మైసూరులో జరిగే దసరా ఉత్సవాలకు దేశంలోనే ప్రత్యేక చరిత్ర ఉంది. ఏటా దసరా వేళ పదిరోజుల పాటు జరిగే వేడుకలతో పాటు ప్రత్యేకించి ఏనుగుపై బంగారు అంబారీ ఊరేగింపు ఆకర్షణగా ఉంటుంది. దసరా ఉత్సవాలు నవరాత్రుల తరహాలో ఒకరోజు ముందుగా ప్రారంభం కావడంతో పదిరోజులు జరుపడం సంప్రదాయంగా ఉంది. కానీ 2025లో జరిగే దసరా ఉత్సవాలు 11 రోజులు కొనసాగుతాయి. దసరా ఉత్సవాలు జరుగుతున్న నాలుగు శతాబ్దాలలో ఎన్నడూ జరుగని రీతిలో నిర్వహించదలచారు. సెప్టెంబర్ 22వ తేదీనుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని ఆధ్యాత్మిక చింతకులు డాక్టర్ శెల్వపిళ్లై అయ్యంగార్ వివరించారు. విజయనగర్ సామ్రాజ్యం రాజు 1399వ ఏట దసరా ఉత్సవాలను శ్రీకారం చుట్టారు. 1410 నుంచి మైసూరు రాజులు పరంపరను కొనసాగిస్తూ వచ్చారన్నారు. ఇలా శతాబ్దాల కాలంగా ఉత్సవాలు జరిపే సంప్రదాయం ఉందన్నారు. రెండు రోజుల పాటు పంచమి వచ్చినందున ఉత్సవాలు ఒక రోజు అదనంగా జరుగుతాయన్నారు. ఏళ్ళ తరబడి బంగారు అంబారీపై రాజులు ఊరేగేవారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజుకు బదులుగా నాడదేవత చాముండేశ్వరీ దేవి ఉత్సవ విగ్రహాలను బంగారు సింహాసనంపై ఊరేగించే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. దసరా ఉత్సవాలను ఏటా సాహితీవేత్తలు, విభిన్నరంగాల సాధకుల ద్వారా శ్రీకారం చుట్టే విధానం ఉంది. ఇప్పటికీ మైసూరు రాజ సంస్థాన సంప్రదాయాలను ప్యాలెస్‌లో పాటిస్తుంటారు.

జడ్పీ సీఈఓ తనిఖీలు



సౌకర్యాలపై ఆరా తీస్తున్న జడ్పీ సీఈఓ ప్రవీణ్ బాగేవాడి

బంగారపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భిక్షాటనను సంపూర్ణంగా నియంత్రించే దిశగా నిర్మించిన నిరాశ్రయుల పరిహార కేంద్రం సహకారి కానుందని వాటిని సద్వినియోగం చేసే దిశగా ప్రామాణిక ప్రయత్నాలు చేయాలని జిల్లా పంచాయతీ సీఈఓ ప్రవీణ్ బాగేవాడి తెలిపారు. తాలూకాలోని బీరండహళ్ళి గ్రామ సమీపాన గల నిరాశ్రయుల పరిహార కేంద్రాన్ని గురువారం అకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరాశ్రయ కేంద్రాలు కౌశల్యాధారిత తర్ఫీదు కేంద్రాలుగా స్వయం ఉపాధి కల్పించేలా ప్రేరణ కావాలన్నారు. నైపుణ్యాధారిత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్వావలంబనతో జీవనం మళ్ళీ కొత్త అడుగులతో ముందుకు సాగేందుకు వేదిక కావాలన్నారు. బీరండహళ్ళి నిరాశ్రయుల కేంద్రంలో 127మంది పురుషులు, 27మంది మహిళలు మొత్తం 154మంది దేశంలోని వివిధ ప్రాంతాలవారు ఉన్నారన్నారు. వారికి ప్రతిరోజూ భోజనం, వసతి, వైద్య పరీక్షలు చేసేందుకు ముగ్గురు నర్సులను నియమించినట్టు తెలిపారు. 15రోజులకో సారి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుతం 25 ఎకరాలలో తోట పనులు చేస్తున్నారన్నారు. 5 మూటల రాగి పండించారన్నారు. టెంకాయనారు తీసే విధానంపై తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. వారి కష్టానికి గాను రూ.38 చొప్పున ఇస్తున్నట్టు తెలిపారు. సమాచారం ఇచ్చిన అధికారులను ప్రశంసించారు. ఈ సందర్భంగా చిక్కఅంకండహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు గిరిజా శ్రీనివాస్, ఈఓ రవికుమార్, పీడీఓ దేవరాజు, అధికారి మంజునాథ్, ఎస్‌డీఏ సునితా తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా అక్షరాభ్యాసం



హోమంలో అభియానంద మహరాజ్ గురూజీ తదితరులు

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రహళ్ళి మెయిన్‌రోడ్డులోని అనుపమ విద్యామందిరంలో నర్సరీ విద్యార్థులకు గురువారం అక్షరాభ్యాసం నిర్వహించారు. యలహంక రామకృష్ణ ఆశ్రమానికి చెందిన అభియానంద మహరాజ్ గురూజీ సాన్నిధ్యం వహించారు.ఐ ఈ కార్యక్రమం నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బీకే వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్టు

దొడ్డబళ్ళపుర, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నంది కొండలను వీక్షించేందుకు వచ్చిన జంటను అడ్డగించి నగదు, నగలు లాక్కుని దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దొడ్డబళ్ళాపుర త్యాగరాజనగర్ నివాసి దుర్గా ప్రసాద్ (22), రోజిపురకు చెందిన ప్రేమ్‌కుమార్ (24), అణగలపుర గ్రామానికి చెందిన అరుణ్ (26)లు అరెస్టు అయిన నిందితులు. బెంగళూరుకు చెందిన దంపతులు నంది కొండలకు వచ్చారు. కణవెపుర గ్రామం వద్ద వారిని అడ్డగించి దోపిడీకి పాల్పడ్డారు. ఫోన్ పే ద్వారా 25వేల రూపాయల నగదు బదిలీ చేయించుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. 24గంటల్లోనే నిందితులను అరెస్టు చేశారు.

బమూల్ అధ్యక్షుడిగా డీకే సురేష్ ఏకగ్రీవ్రం

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులుగా మాజీ ఎంపీ డీకే సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య సభ్యులు సమిష్టి నిర్ణయం తీసుకొని డీకే సురేష్‌ను ఎన్నుకున్నారు. ఇదే సందర్భంగా డీకే సురేష్ మాట్లాడుతూ పాడిరైతులు, పాల సహకార సంఘం సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. పాడి రైతులకు అనుకూలమయ్యేలా పనిచేస్తానన్నారు. బెంగళూరు గ్రామీణ నుంచి రెండు పర్యాయాల పాటు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన డీకే సురేష్ ఏడాది కిందట జరిగిన ఎన్నికలలో ఓటమి చెందారు. ఆతర్వాత కొంత కాలం ఎటువంటి పదవులకు వద్దని దూరంగా ఉంటూ వచ్చిన డీకే సురేష్ ఇటీవల బమూల్ డైరెక్టర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసి గెలుపు సాధించారు. బమూల్‌కు 14మంది డైరెక్టర్‌లు కాగా 11 మంది కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు ఉన్నారు. డైరెక్టర్ స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నికైన డీకే సురేష్‌ను అధ్యక్ష స్థానానికి శుక్రవారం జరిగిన ఎన్నికల నామినేషన్‌లో ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయడంతో ఆయన గెలుపు సునాయాసమైంది.

అక్షయ్ నేత్రాలు దానం

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్‌గా మారిన అక్షయ్‌కు చెందిన రెండు కళ్ళను దానం చేశారు. ఈనెల 15న ఆదివారం మధ్యాహ్నం మార్కెట్‌కు వెళ్ళి వస్తుండగా బనశంకరి ప్రాంతం శ్రీనివాసనగర్ బ్రహ్మ చైతన్య మందిరం సమీపంలోని ఎండిపోయని ఓ చెట్టు కొమ్మ మీదపడటంతో అక్షయ్ స్పృహ కోల్పోయారు. ఇతడు కత్రిగుప్పలోని శ్రీనగర్ ప్రాంత నివాసి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్షయ్ బ్రెయిన్ డెడ్‌గా బుధవారం వైద్యులు నిర్ధారించారు. గురువారం అతడు కన్నుమూశారు. అనారోగ్యంతోపాటు కుర్చీకే పరిమితంగా ఉండే తండ్రికి అక్షయ్ మృతి చెందిన విషయం తెలియదని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబానికి దిక్కుగా ఉండే అక్షయ్ మృతితో జీర్ణించుకోలేని స్థితిలో ఉన్న కుటుంబీకులు రెండు కళ్ళను దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

తొక్కిసలాటపై సామాజిక కార్యకర్త ఫిర్యాదు

● ఆర్సీబీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే అనుమానం

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) గెలుపొందాక జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన పరిణామాలపై సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం నగరంలోని కబ్బన్‌పార్క్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సీఎం, డీసీఎం సహా ఐఏఎస్, పోలీసుల అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఫైనల్స్ పోటీలకు ముందే విధానసౌధ వద్ద విజయోత్సవం ఆచరించడానికి, ర్యాలీకి సంబంధించి కబ్బన్‌పార్క్ ఏసీపీకి సమాచారం ఇచ్చి సన్నద్ధమయ్యారన్నారు. ఆర్సీబీ జట్టు గెలుపు గురించి ముందే ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. పోటీకి ముందే కార్యక్రమం గురించి ఎలా ప్లాన్ చేశారన్నారు. ముందస్తు సమాచారం ఉందా లేదా మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందా అనే అనుమానం ఉందన్నారు. దీనిపై రానున్న రోజుల్లో బీసీసీఐకు ఫిర్యాదు చేస్తానన్నారు.

మాజీ మంత్రి ఆంజనేయ పర్యటన



వార్డుల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రి ఆంజనేయ

మహదేవపుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హూడి, తిగళరపాళ్య, శాంతినగర్ తదితర ప్రాంతాలలో కులవర్గీకరణ నమోదుకు సంబంధించి జాగృతి అబియానలో మాజీ మంత్రి, కేపీసీసీ ఉపాధ్యక్షుడు హెచ్ అంజనేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30ఏళ్లలో మాదిగ సముదాయానికి తగిన రిజర్వేషన్ లభించక అన్యాయం జరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సముదాయానికి తగినన్ని సౌలభ్యాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎస్సీ కులవర్గీకరణ నమోదులో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా మాదిగ సముదాయం తరపున పాలకులు ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరలోనే కులవర్గీకరణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భారతీయ సేవాసమితి జాతీయ అధ్యక్షుడు హెచ్ఎం రామచంద్ర, హెచ్‌వీ మంజునాథ్, కృష్ణమూర్తి, విక్రమ్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

● దక్షిణ కన్నడ జిల్లాలో దారుణం



ఇంటి వద్ద పోలీసులు



దంపతులు (ఫైల్)

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సరిగ్గా 16 ఏళ్ల తర్వాత భార్య గర్భిణి కావడంతో ఇరుకుటుంబాలల్లో ఆనందం నెలకొంది. మరో పదిరోజుల్లో సీమంతం జరపాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఏం జరిగిందో కానీ బుధవారం రాత్రి భార్యాభర్తలు గొడవపడి గురువారం ఉదయం అయ్యేసరికి ఇరువురు మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా నావూరు గ్రామం బడగుండికి అనుబంధంగా ఉండే కల్లోడి కాలనీలో నివసించే తిమ్మప్ప మూల్య(52), భార్య జయంతి(45) మృతి చెందినవారు. గురువారం ఉదయం ఎంతసేపటికీ ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో స్థానికులు గమనించిన వేళ మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. జయంతి మృతదేహం బెడ్‌రూంలో పడిఉండగా తిమ్మప్ప మూల్య ఇంటిపైకప్పునకు ఉరివేసుకుని ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. తిమ్మప్ప ముందుగా భార్యను హతమార్చి ఆ తర్వాత ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమికంగా పోలీసులు అభిప్రాయపడ్డారు. వీరికి 16 ఏళ్ల కిందట వివాహం కాగా ప్రస్తుతం జయంతి ఎనిమిది నెలల గర్భంతో ఉన్నారు. ఇద్దరూ అన్యోన్యంగా ఉండేవారని ఎందుకు ఇటువంటి నిర్ణయానికి వచ్చేరనేది అంతుచిక్కని విషయంగా మారింది. ఆర్థిక సమస్యలు కారణమా అనే కోణంలో విచారణలు జరుపుతున్నారు. బంట్వాళ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండ సమీపంలో శ్రీకైలాశ క్షేత్రంలో వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కియ పోలీసులు తెలిపిన మేరకు మోహిత్, సాత్విక్ శ్రీకైలాసంకు వెళ్తుండగా వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాల కొండల్‌రాయుడు శ్రీకైలాసం నుంచి దుద్దేబండకు ఆటోలో వస్తున్నాడు. దుద్దేబండ మలుపువద్దకు రాగానే ఆటో, ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో గుట్టూరుకు చెందిన మోహిత, సాత్విక్‌లకు తీవ్రగాయాలుకాగా ఆటో డ్రైవర్ పాలకొండరాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను ఆర్టీసీ బస్సులో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లికి వందనంతో అమ్మకు ఆనందం

మడకశిర టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలు చదువుతున్న అంతమందికి రూ.13వేల ప్రకారం తల్లుల ఖాతాలో నగదు జమ చేయడంతో తల్లుల ఆనందానికి అవధులు లేకుండాపోయయి. మడకశిర నియోజకవర్గంలో 21,386 మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాలో రూ.27.80కోట్ల నగదు జమ అయినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్ గురువారం తెలిపారు. మడకశిర మండలంలో 8105 మంది విద్యార్థులకు రూ.10,53,65,000, రొళ్లలో 3205 మందికి రూ,4,16,65,0000, అగళిలో 2385 మందికి రూ.3.10 కోట్లు ఖాతాల్లో పడ్డాయన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరం..!

● మెనూ ప్రకారం వడ్డింపు
● విద్యార్థుల్లో ఆనందం



మధ్యాహ్న భోజనం కోసం క్యూలో నిల్చున్న విద్యార్థినులు

సోమందేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో కూటమి ప్రభుత్వం సమూల మార్పులు తీసుకురావడంతో విద్యార్థులు కడుపునిండా భోజనం చేస్తున్నారు. బుధవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 689మంది విద్యార్థులుండగా మెనూలో అన్నం, సాంబర్, గుడ్డు, చిక్కిని అందజేశారు. భోజనం రుచికరంగా ఉండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 75కేజీల బియ్యం వండినట్లు నిర్వాహకుడు తెలిపారు. సన్నబియ్యంతో అన్నం వండటంతో పూర్తిస్థాయిలో అయిపోతోందని ఆయన తెలిపారు. వండిన అన్నమంతా అయిపోగా తిరిగి వండి వడ్డించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నంబియ్యంతో వండటంవల్ల గతంలో మాదిరి భోజనం వృథా కావడంలేదన్నారు.



విద్యార్థులకు వడ్డించగా ఖాళీగా ఉన్న పాత్ర

భోజనం రుచికరంగా ఉంది: ప్రతీక్, 10వ తరగతి విద్యార్థి



గతంలో మధ్యాహ్న భోజనం బాగుండేదికాదు. తిన్నంత తిని పారబోసేవారం. ఇప్పుడు కడుపునిండా భోజనం చేస్తున్నాం. భోజనం ఇంట్లో చేసినట్లుగా ఉంది.

ఆకలి తీరుతోంది: కార్తీక్, 8వ తరగతి విద్యార్థి



ప్రస్తుతం పాఠశాలలో వడ్డిస్తున్న అన్నం రుచికరంగా ఉండటంతో ఆకలి తీరుతోంది. ఇలాంటి భోజనం వడ్డిస్తే మాలాంటి విద్యార్థులకు ఆకలి బాధలు ఉండవు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ చందన

పెనుకొండ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ చందన.. ఫర్టిలైజర్ షాపు యజమానులను హెచ్చరించారు. ఐదెకరాల్లో రూ.2లక్షలు పెట్టుబడి పెట్టి రెండు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు నిండాముంచిన నకిలీ విత్తనాలు అంటూ సర్వం నష్టపోయామని ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయాధికారి చందన, సిబ్బందితో కలిసి పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. షాపులో విక్రయించిన ఎరువులు, విత్తనాల బిల్లులను రికార్డుల్లో తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని లేనిపక్షంలో షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. రబీలో ఉష్ణోగ్రతలు పెరిగి మొక్కజొన్న, వరి దెబ్బతిని దిగుబడి తగ్గిందని రైతులకు వివరించారు.

రాజన్న అమృత మహోత్సవాన్ని జయప్రదం చేయండి

పావగడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రత్న సహకార మంత్రి కేఎన్ రాజన్న 75వ అమృతమహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పావగడ వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. 21న తుమకూరు లోని జూనియర్‌కళాశాల మైదానంలో ఆయన జీవితచరిత్ర పుస్తకావిష్కరణతోపాటు 75వ జన్మదినం, పావగడ తరుపున అధిక సంఖ్యలో వాల్మీకి నాయకులు తరలిరావాలని వేదిక అధ్యక్షుడు పాలేగార లోకేష్ పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

లేపాక్షి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

లేపాక్షి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రం లేపాక్షి దుర్గావీరభద్ర స్వామి హుండీ ఆదాయం ఏడునెలలకుగాను రూ8,16,381 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి నరసింహరాజు తెలిపారు. ఆలయ ఈఓ నరసింహమూర్తి, గ్రామస్థుల సమక్షంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రూ.8,16,381 ఆదాయం వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతు


పెనుకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగే ప్రజాస్వామిక ఉద్యమాలకు రాయలసీమ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ఉంటుందని వేదిక అధ్యక్షుడు రాజశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దళిత, గిరిజనుల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, ఆత్మహత్యలను ఖండిస్తూ రాయలసీమలో కూడా ఏర్పడిన ఐక్య సంఘటనలో పాల్గొంటూ తమవంతు పాత్ర పోషిస్తుందన్నారు. అనంతపురంలో జరిగిన గిరిజన విద్యార్థిని తన్మయి హత్య, రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికై జరిగిన అత్యాచారం, చిత్తూరు జిల్లా కుప్పంలో అప్పుకట్టలేదన్న నెపంతో మహిళను చెట్టుకు కట్టేసి దాడిచేయడం, కర్నూలు జిల్లా కౌతాళం మండలం నల్లూరు గ్రా మంలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటన జరగడం దారుణమన్నారు.

గుంతలోపడి ఆవు మృతి



మృతిచెందిన పాడి ఆవు

చిలమత్తూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లిన పాడిఆవు గోబర్ గ్యాస్ గుంతలో పడి మృతి చెందింది. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మారెప్ప తన పాడి ఆవును శుక్రవారం గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేతకోసం తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న గోబర్ గ్యాస్ గుంతను గుర్తించక పాడిఆవు అందులో పడిపోయింది. గుర్తించడం ఆలస్యం కావడంతో నీటిలో పడిన పాడి ఆవు ఊపిరాడక మృతి చెందింది. ఎంతసేపటికి ఆవు రాకపోవడంతో అనుమానం వచ్చి అక్కడ గాలించగా గుంతలో విగతజీవిగా కనిపించింది. పాలు ఇస్తూ కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉన్న ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఇటీవలే రూ.80 వేల వెచ్చించి ఇంటికి తీసుకువచ్చాడు. ఇలా గుంతలో పడి మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయినట్లు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1606.09	1,582.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,941	801
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	160	1,752
నీటి నిల్వ (టీఎంసీలు)	30.49	5.98

25న చలో దేవనహళ్లి

● బలవంతపు భూసేకరణపై రైతుల ఆగ్రహం



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గోణి బసప్ప బంగేర్

బళ్లారి సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేఐఏడీబీ భూ స్వాధీనాన్నివ్యతిరేకించి జూన్ 25న దేవనహళ్లి చలో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గోణి బసప్ప బంగేర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరు గ్రామాంతర జిల్లా దేవనహళ్లి తాలూకా చెన్నరాయ పట్టణ వ్యాప్తి భూములను బలవంతంగా, తక్కువ ధరలో కేఐఏడీబీ భూ స్వాధీ నాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిని పూర్తిగా రద్దు చేయాలని 25న దేవన హళ్లి తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడానికి చలోకు పిలుపు నిచ్చామన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి చెన్నరాయనపట్టణ పరిధి లోని 13గ్రామాల రైతులు ధర్నానిర్వహిస్తున్నారు. 80శాతం మంది రైతులు లిఖిత పూర్వకంగా భూస్వాధీనాన్ని వ్యతిరేకించారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య వివిధ ప్రదేశాలలో ఈ రైతులు నిర్వహి స్తున్న నిరసన స్థలాలను సందర్శించి తాను అధికారంలోకి వస్తే అన్యాయమైన బలవంతపు భూసేకరణను రద్దు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఇప్పుడు ఇన్‌ఛార్జీ మంత్రిగా ఉన్న ముని యప్ప రైతులకు అన్యాయం జరగకుండా బలవంతపు భూసేకరణను అనుమం తిచబోమని అన్నారు. రెండున్నర సంవత్సరాలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వారిద్దరూ తమ హామీలను మరిచిపోయారన్నారు. రాష్ట్రంలోని ప్రజా స్వామ్య ధృక్పథం ఉన్న అన్ని వ్యక్తులు సంస్థలు దేవనహళ్లి చలోలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిషేదాజ్ఞల ద్వారా నిరసనను అణచివేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం చేసే ఏ ప్రయత్నానైనా తిప్పికొట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో సంస్థ రాష్ట్ర డివిజనల్ కార్యదర్శి ఎం.ఎల్.కే.నాయుడు, విరూపాక్ష బన్నిహట్టి జిల్లా ఉపాధ్యక్షులు, చంద్రశేఖర్ మేటీ తాలూకా అధ్యక్షులు, సండూర్ దివాకర్, సిద్రామన్‌గౌడ సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు తదితరులున్నారు.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సంఘం అధ్యక్షుడు దేవన్న

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

● సండూర్ తాలూకా కార్మికుల సంఘం డిమాండ్

బళ్లారి సిటీ,జూన్ 19(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణం, స్కాలర్‌షిప్‌లు, ప్రసూతి, వివాహం ఇతరసౌకర్యాలకు రూ. 5లక్షల సహాయం అందజేసి ఆదుకోవాలని కర్ణాటక రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మికుల సంఘం సండూరు తాలూకా అధ్యక్షుడు దేవన్న కోరారు. సండూరు తాలూకాలోని హొసదరోజి గ్రామంలో కర్ణాటక రాష్ట్ర భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మికుల సంఘం సండూర్ తాలూకా యూనిట్ నిర్వహించిన సమావేశంలో ఆయన తాలూకా కన్వెన్షన్ మేని ఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. నిజమైన నిర్మాణ కొత్త రిజిస్ట్రేషన్ కోసం తగిన చర్యలు తీసుకోవాలని, పేద కార్మికులు ఇళ్లు నిర్మించుకు నేలా ప్రభుత్వం 1996లో కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయా లన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల సమావేశం నిర్వహించబడుతుం దన్నారు. ఈసదర్భంగా సంఘ నాయకులు శంకన్న, హాలస్వామి, తిమ్మప్ప, సన్నరంగస్వామి, వివిధ గ్రామాల సభ్యులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

● పతంజలి యోగా సమితి తాలుకా సంచాలకుడు మౌనేష్

కంప్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో జూన్ 21న శని వారం స్థానిక శారద పాఠశాల ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వైభవంగా జరుపుకుందామని పతంజలి యోగా సమితి తాలుకా సంచాలకులు మౌనేష్ తెలిపారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 5.30 నుండి 7 గంటల వరకు యోగ, ధ్యానం, ప్రాణాయామం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగ సాధకుడు బాలచంద్రశర్మ పాల్గొంటారన్నారు. అలాగే అతిథులుగా ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొంటారు. వారితో పాటు మున్సిపల్ అధ్యక్షుడు బట్ట ప్రసాద్, సహా అతిథులుగా పాల్గొం టారు. జూన్ 20న సాయంత్రం శ్రీ రామాలయం నుండి సైకిల్, మోటారు జాత కార్యక్రమం నిర్వహిం చబడుతారన్నారు. యోగ దినోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొట్రేష, కార్యదర్శి చిత్రగారు పాల్గొన్నారు.

విజయనగరం (హోస్పేట) : విజయనగర జిల్లా స్థాయిలో 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుక జూన్ 21వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్‌కేఎంఈపీఎల్ ఫ్రీడమ్ పార్కులో జరగనుంది. కేంద్ర, రాష్ట్ర ఆయుష్ సంస్థల సహకారంతో ఈ యోగా దినోత్సవ కార్యక్ర మాన్ని గృహ నిర్మాణం, మైనార్టీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ జమీర్ అహ్మద్ ప్రారంభిస్తారన్నారు. ఆరోగ్య ఆయుష్ సేవల మంత్రి దినేష్ గుండూరావు, హోస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అధ్యక్షత వహిస్తారు. కార్యక్రమానికి అన్ని శాఖల ముఖ్య అధి కారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికారులు పాల్గొం టున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థలను పొగాకు రహిత ప్రాంతాలుగా ప్రకటించాలి

● వంద అడుగుల పరిధిలో అమ్మకాలు చేపట్టరాదు ● బస్సులపై పొగాకు ప్రకటనలు తొలగించాలి: ఏడీసీ జుబేర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక మాధ్యమిక, పూర్వ విద్యాలయ విద్యాశాఖల పరిధిలోని అన్ని పాఠశాలలు ,కళాశాలలను పొగాకు రహిత ప్రాంతాలుగా ప్రకటించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్ డీడీపీఐ అధికారులను ఆదేశించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం కింద జిల్లాలోని అన్ని ప్రజా ప్రాంతాల్లో కోట్పా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై చర్చించడానికి గురువారం నగ రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాన్ వీడియో ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన పొగాకు నియంత్రణ సెల్ పురోగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యాసంస్థలను పొగాకు రహితంగా ప్రకటించడానికి టోపీఎల్ యాప్ లింక్‌ను రూపొందించామని, ఈలింక్‌ను అన్ని పాఠశాలలు, కళాశాలలకు పంపామన్నారు. సమాచారాన్ని తప్పకుండా నమోదు చేయాలన్నారు.

పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు తొలగించాలి

బళ్లారి డివిజన్ పరిధిలోకి వచ్చే స్టేషన్లలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషే ధించే బోర్డులు, బస్సులపై ముద్రించిన ప్రకటనలను తొలగించాలని ఏడీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రమాణాల ప్రకారం పొగాకు రహిత గ్రామాలుగా ప్రకటించడానికి మొత్తం 25 గ్రామాలను గర్తించామని ,సిఫార్సుల ఎంపిక కోసం జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారికి పంపాలని పంచాయతీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

బెంగళూరులోని పొగాకు నియంత్రణ సెల్ కో-ఆర్డినేటర్ మహంతేశ్ ఉల్లగాడి టోపీఎల్ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలలు తమ క్యాంపస్‌లను పొగాకు రహితంగా ఉంచడానికి చేపట్టాల్సిన తొమ్మిది కార్యకలాపాలను వివరిం చారు. విద్యాసంస్థల చుట్టూ 100 అడుగుల పసుపు గీతను గుర్తించడం , 100అడుగుల జోన్‌లో ఎటువంటి దుకాణాలు, విక్రేతలు అమ్మకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని బారులు, రెస్టారెంట్లలో ప్రత్యేక ధూమపాన ప్రాంతాన్ని ఏర్పాటు చేసేలా తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, జిల్లా బాలకార్మికప్రాజెక్టు డైరెక్టర్ మౌనేశ్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వరదాసప్పనవర్, జిల్లా పొగాకు నియంత్రణ సెల్ కోఆర్డినేటర్ ప్రశాంత్, జిల్లాస్థాయిలోని వివిధ శాఖలకు చెందిన వివిధ కార్యక్రమ అధికారులు ,ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యువతీయువకులు చదువులతో పాటు రాజ్యాంగాన్ని తీసుకొచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ సూచించారు. గురువారం తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో అంబేడ్కర్ సంఘం నిర్వహించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబే ద్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమన్నారు. అంబేడ్కర్ ప్రకారం పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి. తమ భవిష్యత్తు లక్ష్యాలతో సాధించాలి. రాజ్యాంగం ప్రకారం వారు పౌర హక్కులను పొందుతున్నారు. వారు మూఢనమ్మకాలను వదులుకుని ఆర్థికంగా బలపడాలి. పిల్లల్లో అంబేడ్కర్ సూత్రాలు, సూత్రాల జ్ఞానాన్ని నింపాల న్నారు. పిల్లలకు సంస్కృతి నైతికలను నేర్పించాలి.

డెంగీపై అవగాహన



గ్రామస్థులతో మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్లా

సిరుగుప్ప, జూన్ 19(ఆంధ్రజ్యోతి) :డెంగీ వ్యాధి అరికట్టడంపై ప్రజలకు అవగాహన అత్యవసరమని జిల్లా ఆరోగ్య ప్రభుత్వాస్పత్రి డెంగ్యూ వ్యాధి నివారణ వైద్యాధికారి అబ్దుల్ తెలిపారు. గురువారం తాలుకా పరిధిలోని బూదిగుంప గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికి తిరుగుతూ డెంగ్యూ వ్యాధిని అరికట్ట డంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ వ్యాధి దోమలబెడద వలన వస్తుందని ఆయన తెలిపారు. వైద్యాధికారి వెంకప్ప, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలస్తీనా, ఇరాన్ మారణహోమంపై వామపక్షాల నిరసన



కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

బళ్లారి సిటీ, జూన్ 119(ఆంధ్రజ్యోతి): అమెరికా సహాయంతో పాలస్తీనాలోని గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని, ఇరాన్ పై బాంబు దాడిని వ్యతిరేకిస్తూ వామపక్షాలు నిరసన చేపట్టాయి. గురువారం జాతీయ సామరస్య దినోత్సవంలో భాగంగా నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు వారు ఆందోళన నిర్వహించారు. ఆమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాద విధానాలను ఆపివేయాలని వారు హెచ్చరించారు. ఈసందర్భంగా ఎస్‌యూసీ జిల్లా కార్య దర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ వివిధ దేశాలలో యుద్ధ అల్లకల్లో పరిస్థితిని సృష్టించడం, ఆయుధాలను అమ్మడం లాభాలను పెంచడం అమెరికన్ పెట్టుబ డిదారుల పని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెట్టుబడిదారుల ప్రతి నిధి ఆర్థిక సంక్షోభంలో ఉన్న అమెరికా యుద్ధాల కృత్రిమ శ్వాస ద్వారా తన ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోస్తోందన్నారు. యుద్ధదాహంతో ఉన్న అమెరికా,ఇజ్రా యెల్ ఇతర సామ్రాజ్యవాద దేశాలకు సరైన గుణపాఠం నేర్పడానికి ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక పోరాటాలు ,శ్రామిక ప్రజల పోరాటాలను తీవ్రతరం చేయాలన్నారు. సీపీఐఎం జిల్లాకార్యదర్శి సత్యబాబు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఆమెరికా సహాయంతో ఇజ్రాయెల్ పాలస్తీనాలోని గాజాపై అనాగరికమైన బాంబుదాడులకు పాల్పడుతోందన్నారు. కాల్పుల విరమణ విధా నాన్ని ఉల్లంఘించింది. పాఠశాలలు, ఆసుపత్రులు ,మసీదులను లక్ష్యంగా చేసు కుని ఇజ్రాయెల్ ఇప్పటివరకు 55,000 మంది పాలస్తీనా పౌరులను చంపిందన్నారు. వారిలో ఎక్కువ మంది పిల్లలు మహిళలు ఇటీవల ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై బాంబు దాడులు చేసి అమాయకులను చంపేస్తున్నారన్నారు. సీనియర్‌కార్మిక నాయుడు విఠల్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమె రికా ఇజ్రాయెల్‌లను సంతృప్తి చేస్తోంది. ఇది భారతదేశ స్వాతంత్ర్య పోరాట వారసత్వం , సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిపై ముద్ర వేసిందన్నారు. ఈ సంద ర్భంలో ఎస్‌యుసీ నాయకుడు డాక్టర్ ప్రమోద్, దేవదాస్, చంద్రకుమారి, సో మశేఖర్‌గౌడ, శాంత, నాగరత్న, హనుమప్ప పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మేయర్ నందీష్, మాజీ మేయర్ రాజేశ్వరి

బళ్లారిరూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలో మదర్‌థెరిస్సా శాంతిధామ కేంద్రంలో రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను మేయర్ నందీష్ మాజీ మేయర్ రాజేశ్వరి నేతృత్వంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ నందీష్ మాట్లా డుతూ దేశంలో పేద ప్రజల కష్టం వెనుకబడిన వర్గాల వారికి అధ్యాప కులు అనుకూలంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నో సేవలు అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్ కార్పొరేటర్ గాదప్ప, జగన్ కాంగ్రెస్ ప్రముఖులు తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పోలీసులకు పట్టుబడిన దొంగలు

రాయచూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మహిళ గొంతులో బంగారు గొలుసుతో పాటు బైక్‌ల దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులు సింధనూరు పోలీసులకు గురువారం పట్టుబడ్డారు. నాల్గు రోజుల క్రితం సింధనూరు నగరంలోని మహిళ ఒకరు వంటరిగా వెళుతుండగా వెనక్కి నుంచి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో గొలుసు లాకె ళ్లాకరు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు నిందితులకు బైక్ దొంగత నాల్లో భాగమున్నట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులు ఆరీఫ్ సిద్ధరామ య్యలతో పాటు మరో మైనర్ బాలుడు వీరికి సహకరించినట్లు గుర్తిం చిన బంగారు గొలుసుతో పాటు 24 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.16 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు.

అదనపు పన్ను వసూళ్లపై ఆగ్రహం

కంప్లి,జూన్19(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో 19వ వార్డు ప్రజలు బీ ఖాతా చేస్తే సమయంలో అదనంగా ట్యాక్స్ రూపంలో వసూలు చేశా రని స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌కు ప్రజల ఫిర్యాదులు రూపంలో తెలియజేశారు. గురువారం పట్టణ పంచాయతీలో ఒక్క శాతం ట్యాక్స్ రూపంలో ఎక్కువ వసూళ్ల విషయంపై చర్చించారు. ప్రభుత్వ ఆదేశాలు లేకున్నా రెవెన్యూ సిబ్బంది వన్ శాతం ట్యాక్స్ రూపంలో వాసులు చేయడం సరికాదన్నారు. ఆవేదన వ్యక్తపరిచారు. ఇలా ముందుకు కొన సాగరాదని అధికారులకు తెలిపారు. అనంతరం ఇకపై పట్టణ ప్రజలకు ఫారం త్రీ ఉచితంగా పొందవచ్చని రాజశేఖర్ తెలిపారు. ఇలాంటి ఫీజులు కట్టే అవసరం లేదన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బందిపై కూడా ఫిర్యాదు చేస్తున్నారు. ఇకపై ఆ శాఖ అధికారులు కానీ సిబ్బంది నుండి గానీ సమస్యలు ఎదురుకాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఎక్కువ వసూలు చేసి సిబ్బందిపై కూడా దృష్టి వుంచుతామన్నారు. అనంతరం ఫారం త్రీ పొందిన ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి తీర్థప్రసాద్ ఉపాధ్యక్షులు కనికేరి పంపా పతి, కౌన్సిలర్ వెంకట రమణ బాబు, హాలప్ప, లోకేష్, అమరేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



ఫారాలను అందజేస్తున్న స్థాయిసమితి అధ్యక్షుడు రాజశేఖర్

హోసూరు జోన్

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై ర్యాలీ



ర్యాలీకి పచ్చజెండా చూపుతున్న డీఎస్పీ మహాలక్ష్మి

హోసూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హోసూరులో గురువారం నిర్వహించిన జాగృతిలో 200మందికిపైగా ప్రభుత్వ పాఠ శాల విద్యార్థులు పాల్గొన్నారు. బ్యానర్లు చేతబట్టి ఊరేగారు. మద్యపాన నిషేధం, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్‌వీ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాల గేటు వద్ద ప్రారంభమైన ర్యాలీకి మద్యపాన నిషేధ విభాగం డీఎస్పీ మహాలక్ష్మీ పచ్చజెండా చూపారు. ప్రత్యేకించి యువత సహా ఎవరూ మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడరాదని సూచిం చారు. కామరాజ్ కాలనీ, తాలూకా ఆఫీస్ రోడ్డు, డెంకణీకోట రోడ్డు తది తర ప్రధాన రహదారుల మీదుగా సాగారు. సబ్-కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం వద్ద ర్యాలీ ముగిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాయచూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతున్న వ్యక్తి ఒకరు వెనకి నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాన్వి తాలూకా బొమ్మనాళకు చెందిన నాగప్ప(48) తన భార్యతో కలిసి మాన్వికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న నాగప్ప అక్కడికక్కడే మృత్యువా తపడగా వెనక కూర్చున్న భార్య తీవ్రంగా గాయపడింది. సంఘటన స్థలానికి చేరుకున్న మాన్వి పోలీసులు.. గాయపడిన మహిళను తాలూకా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

మినీ బస్సుల ఏర్పాటుపై హర్షం

హోసూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిధిలోని 15రూట్లలో 13మినీ బస్సులు నడిపేలా చర్యలు చేపట్టడంపై జిల్లా యంత్రాంగానికి, తమిళనాడు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెల్పుతు న్నట్టు ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్ అభిప్రా యపడ్డారు. ప్రజా రవాణా వ్యవస్థలో హోసూరు బస్టాండ్, రైల్వేస్టే షన్, సిప్‌కాట్ 1, 2, 3లను అనుసంధానం చేసేలా మినీ బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కార్మికుల ప్రయోజనం కోసం హోసూ రులో షేర్ ఆటో సౌకర్యం ప్రవేశపెట్టడంతో వ్యక్తిగత వాహనాల రాకపోకలు చాలావరకు తగ్గే అవకాశం ఉందన్నారు. కాగా ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్ పరి ధిలో పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రముఖ కూడళ్లలో తక్కువ ఎత్తుతో హంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ నిరంతరం పనిచేయడం లేదని, రద్దీ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మొక్కలు, మిఠాయిల పంపిణీ

హోసూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలో గురు వారం కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఉజావర్ మార్కెట్ సమీపాన ప్రజలకు మొక్కలు, స్వీట్లు పంపిణీ చేశారు. నాయకుల పుట్టినరోజు వేడుకలను అర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు ఎంపీ గోపినాథ్ తెలిపారు. మొక్కలు అందచేయడం ద్వారా ప్రజలలో పచ్చదనంపై జాగృతి కల్పిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు ఇంద్రాణి, నీలకందన్, సాదిక్ ఖాన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీ గోపినాథ్

బస్సుల కోసం విద్యార్థులు, గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

రాయచూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచూరు నుంచి మంత్రాలయంకు వెళ్లె దారిలో గ్రామాల వద్ద బస్సులు నిలపక పోవడంతో సమస్యను ఎదుర్కొంటున్న విద్యార్థులు గ్రామస్థులు ఆందో ళన బాటపట్టారు. గురువారం మంత్రాలయం రోడ్డులోని తుంటాపూర్ స్టేజ్ వద్ద పెద్ద ఎత్తున విద్యార్థులు గ్రామస్థులు రాస్తారోకో ఆందోళన చేపట్టారు. దీంతో దాదాపు గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్ప డింది. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు గ్రామస్థులు, విద్యార్థులు అనేక బస్సులుఏ ఈ మార్గంలో సంచరిస్తున్నా గ్రామాల వద్ద ఆగడం లేదని స్టేజ్‌లు లేవన్న సాకుతో ప్యాసెంజర్‌లను తీసుకోకుండానే వెళు తున్నారన్నారు. ఈ స్టేజ్‌లు బస్‌పాస్‌లు చేసుకున్న విద్యార్థులు సహితం తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. గత్యంతరం లేకా కొంత మంది విద్యార్థులు ఆటోలను, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిం చాల్సి వస్తుందన్నారు. వీరితో పాటు మహిళలు, వృద్ధులు, వికలాంగు లకు సహితం బస్సులు ఆగకపోవడం సమస్యగా మారిందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చినా రెండు మూడు రోజులు బస్సులు ఆపి తిరిగి ఎదాతథా స్థితికి వచ్చిందన్నారు. ఇప్పటికైన బస్సులు ఆపాలని లేదంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామ న్నారు. అనంతరం డిపో అధికారి చంద్రశేఖర్‌కు విద్యార్థులు, గ్రామ స్థుల తరపున వినతి పత్రం అందజేశారు.

సోమసముద్రంలో మౌన అనుష్క పూజలు



మౌన పూజల్లో పాల్గొన్న స్వామీజీలు

బళ్లారిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని సోమస ముద్రం సిద్దలింగ మహాస్వామి మఠం ఆవరణంలో గురువారం మౌన వ్రత కార్యక్రమం పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో పూజ జగద్గురు కొట్టూరు బసవలింగేశ్వర మహాస్వామి జగద్గురు కొట్టూరు స్వామి సంస్థాపక మఠం. జగదురు కొట్టూరుస్వామి, శ్రీధరగడ్డ మహా స్వామి గల మౌన పూజలో పెద్దఎత్తున పాల్గొన్నారు.



పూజల్లో విద్యార్థులు గ్రామస్థులు

డ్రైనేజీ వ్యవస్థలేక ప్రజలకు ఇబ్బందులు

సిరుగుప్ప, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): డ్రైనేజీ వ్యవస్థలు సరిగ్గా లేక పోవడంతో ప్రజలు పట్టణ పంచా యతీ అధికారులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాలుకా పరిధిలోని టెక్కలకోట పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో డ్రైనేజీలో పూడిక పేరు కుపోయింది. చెత్తాచెదారం పూడిక నిండి వుండటంతో మురుగునీరు ప్రవహించక ఆ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబం ధిత పట్టణ పంచాయతీ అధికారు లకు తెలిపినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే డ్రైనే జీల్లో నిండిఎన పూడికను తొల గించి మురుగునీరు తొలగించే విధంగా చేయాలని ప్రజలు అధికా రులను కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో నిండిన కాలువ